అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

● ఇంటింటి ప్రచారంలో విప్ గాంధీ

శేరిలింగంపల్లి, నవంబర్ 14: స్థానికంగా చేపట్టిన అభివృద్ధిని చూసి తనను ఆశీర్వదించాలని, మరోసారి అవకాశమిచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని విప్ అరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి గ్రామం, గోపన్‌పల్లి వీకర్ సెక్షన్ కాలనీ, రాజీవ్‌నగర్, గోపన్‌పల్లి తాండలో స్థానిక మాజీ కార్పొరేటర్ కొమిరి శెట్టి సాయిబాబా ఇతర పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మంగళహారతులతో ఆయనకు స్వాగతం పలుకుతూ విజయ తిలకం దిద్దారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటేయ్యాలని స్థానికులకు అరెకపూడి గాంధీ అభ్యర్థించారు. శేరిలింగంపల్లి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి భవిష్యత్తు తరాలకు తగ్గలు మౌలిక వసతులు కల్పించేందుకు మరో అవకాశాన్ని ఇవ్వాలని కోరారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకొని కారు గుర్తుకే ఓటేసి బీఆర్ఎస్ జెండా శేరిలింగంపల్లిలో ఎగరవేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. మూడోసారి తనపై నమ్మకంతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా గెలిపించి సత్తాచాటలని కోరారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు నీరుడి గణేశ్ ముదిరాజ్, చెన్నంరాజు ముదిరాజ్, జంగయ్య యాదవ్, సతీశ్ ముదిరాజ్, శంకరి రాజు ముదిరాజ్, దారుగుపల్లి నరేశ్, రమేశ్ గౌడ్ తదితర నాయకులు, మహిళ నాయకులు పార్టీశ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మియాపూర్ డివిజన్‌లో ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తున్న విప్, అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

ప్రచారానికి వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి విజయతిలకం దిద్దిన మంగళహారతులు ఇస్తున్న గోపన్‌పల్లి మహిళలు, చిత్రంలో మాజీ కార్పొరేటర్ సాయిబాబా

మీ అభిమానాన్ని ఓటుగా మలచండి..

మియాపూర్, నవంబర్ 14 : నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడిన తన పట్ల ప్రజల ఆదరాభిమానాలు ఎంతో సంతృప్తినిస్తున్నదని రాబోయే అయిదేండ్లు వారి సేవలో తరించే అవకాశాన్ని కల్పించాలని విప్, బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ కోరారు. ప్రజలు తనపై చూపుతున్న ఆదరాభిమానాలను ఈనెల 30 వ తేదీన ఓట్ల రూపంలో ప్రదర్శించాలని విన్నవించారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషి నగర్, ఏంఏ నగర్, స్టాలిన్ నగర్, ప్రశాంత్‌నగర్, మక్త మహబూబ్ పేట్, బీకే ఎన్‌క్లేవ్,రెడ్డి కాలనీలలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, పార్టీ శ్రేణులతో కలిసి గాంధీ మంగళవారం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. అయిదేండ్ల పాటు ప్రజల కోసం పని చేసినట్లు, తన కోసం పోలింగ్ రోజున ఓటర్లు అండగా నిలవాలని కోరారు. నియోజకవర్గ అవసరాలకు అనుగుణంగా రూ.9 వేల కోట్లను వెచ్చించి విస్తృతమైన అభివృద్ధి పనులను చేపట్టినట్లు, రాబోయే రోజులలో మరిన్ని అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందిస్తానని విప్ గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాదాపూర్ విలేజ్‌లో మంగళవారం నిర్వహించిన సదర్ సమ్మేళనంలో స్థానికులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పాల్గొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ అరెకపూడి గాంధీ – మాదాపూర్, నవంబర్ 14

బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం అందిద్దాం..

విప్ గాంధీకి మద్దతుగా కార్పొరేటర్ల ప్రచారం..

కొండాపూర్, నవంబర్ 14 : సంక్షేమంలో సాటి, అభివృద్ధిలో మేటిగా దూసుకుపోతున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపడం సంతోషంగా ఉందని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి మద్దతుగా మంగళవారం ఆమె చందానగర్ డివిజన్ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీ, గంగారం, శిల్పా ఎన్‌క్లేవ్, గౌతమీనగర్, గంగారం హరిజన బస్తీ, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రజలకు అందుతున్న సంక్షేమం, అభివృద్ధిలను మెచ్చుకుని తమ వెంట నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ మంజులరెడ్డి

ఇంటింటి ప్రచారం..

మియాపూర్ : శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీకి మద్దతుగా కార్పొరేటర్లు ముమ్మరంగా ఇంటింటి ప్రచారం చేపడుతున్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్‌లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్, హైదర్‌నగర్ డివిజన్‌లో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు, వివేకానందనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ మాధవరం రోజాదేవిలు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో తమ డివిజన్ల పరిధిలో కాలనీలలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ బీఆర్ఎస్‌కు మద్దతు నివ్వాలని కోరుతున్నారు. గాంధీకి ప్రజలంతా అండగా నిలవాలని, అధిక మెజార్టీతో గెలిపించాలని కార్పొరేటర్లు వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు, రోజాదేవిలు కోరారు. కాగా ఇంటింటి ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని కార్పొరేటర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీ డివిజన్‌లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ ఇంటింటి ప్రచారం

హైదర్‌నగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు

వివేకానందనగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

రెండు నామినేషన్ల ఉపసంహరణ

మియాపూర్, నవంబర్ 14 : శేరిలింగంపల్లి శాసన సభ అభ్యర్థిత్వానికి దాఖలైన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ సతీమణి అరెకపూడి శ్యామల స్వతంత్ర అభ్యర్థిగా, మరో స్వతంత్ర అభ్యర్థి హరిణిలు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

చందానగర్‌లో ఉచిత వైద్య శిబిరం

పీజేఆర్ స్టేడియంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొండాపూర్, నవంబర్ 14 : ప్రపంచ మధుమేహ (షుగర్ వ్యాధి) దినోత్సవాన్ని పురస్కరించుకుని చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ దవాఖాన ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రాణాలను హరిస్తున్న వ్యాధులలో మధుమేహ వ్యాధి ఒకటని, దానిని తేలికగా తీసుకుని ప్రాణాంతకంగా మార్చుకోవద్దని దవాఖాన వైద్యులు తెలిపారు. ప్రతి ఒక్కరు సరైన ఆహార నియమాలు, వ్యాయామాలను చేస్తుండడంతో వ్యాధిని నియంత్రణ చేయవచ్చన్నారు. ఉరుకుల, పరుగుల జీవన విధానాలతో అధిక శాతం ఈ వ్యాధి భారిన పడుతున్నారన్నారు. జంక్ ఫుడ్‌కు వీలైనంత వరకు దూరంగా ఉండాలని, వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తే వ్యాధితో ప్రమాదముండదన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, వైద్యులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

చదువుతోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న జీవన నైపుణ్యాలను వెలికి తీయాలని సీఎస్ఐఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డాక్టర్ శైలజ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ పరిధిలోని బొరంపేటలోని ది క్రీక్ ప్లానెట్ స్కూల్ మెర్క్యూరీ క్యాంపస్‌లో కాస్మిక్ లాంబిస్ కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల వేషధారణ ఆలోచింపజేసింది. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బొల్లినేని శీనయ్య, వైస్ చైర్మన్ పాండురంగాచారి, నరేంద్రప్రసాద్, జీవిని, జయ, నాయర్ తదితరులు పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ)

పిల్లల్లో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలి

విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ, సైన్స్ విభాగాధిపతి, డాక్టర్ కె. భారతి

మాదాపూర్, నవంబర్ 14: పిల్లలలో నైపుణ్యత, ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలని ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ, సైన్స్ విభాగపతి, డాక్టర్ కె. భారతి అన్నారు. కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లలకు పలు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ, సైన్స్ విభాగపతి, డాక్టర్ కె. భారతి విచ్చేసి సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణతో పాటు ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... పిల్లలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యతను తల్లిదండ్రులు గుర్తించి వెలికితీయాలన్నారు. పిల్లలకు నచ్చిన రంగాల్లో వారిని ప్రోత్సహించినట్లయితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఇందులో భాగంగా గత వారం రోజులుగా హఫీజ్‌పేట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులకు పలు క్రీడా పోటీలతో పాటు క్విజ్ పోటీలు, సాంస్కృతిక, మ్యాజిక్ షోలు ను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు డాక్టర్, కె భారతితో పాటు సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణ చేతుల మీదుగా బహుమతులను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్‌కు చెందిన పలువురు సభ్యులు ఉన్నారు.